క్లుప్తంగా

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వెంకన్న

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పదో రోజు ఆదివారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్టి జరిపారు. 14వ పాశురం విన్నపం చేశారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

నేడు చింతగట్లలో రెవెన్యూ సదస్సు

పెందుర్తి: మండలంలోని చింతగట్ల సచివాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ద్వారా చింతగట్ల రెవెన్యూ పరిధిలో భూములున్న రైతులు రెవెన్యూ పరమైన, ఇతర్రతా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావొచ్చన్నారు. దీర్ఘకాలిక రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఈ సదస్సునుచక్కని వేదికగా ఉపయోగించుకోవాలని కోరారు.

ఉచిత వినికిడి పరికరాల పంపిణీ శిబిరం నేడు

సబ్బవరం: వినికిడి సమస్యతో బాధపడుతున్న రోగులు నర్సీపట్నంలో సోమవారం నిర్వహిస్తున్న ఉచిత వినికిడి పరికరాల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రతి పీహెచ్‌సీ నుంచి కనీసం 10 మంది వరకూ వినికిడి లోపంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. వినికిడి సమస్య ఉన్న అర్హులైన రోగులకు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు విలువ చేసే వినికిడి పరికరాన్ని ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. దీన్ దయాల్ శ్రవణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని డీఈఐసీలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి హాజరయ్యేవారు తమ వెంట ఒరిజనల్ ఆధార్, రేషన్ కార్డులు, వాటి జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు.

వాహన రిజిస్ట్రేషన్ జాప్యంతో వివాదం



గొడవ కారణంగా గుమిగూడిన వాహన చోదకులు, స్థానికులు

అగనంపూడి: రెండేళ్ల కిందట విక్రయించిన ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసిన యజమాని పేరుమీద రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మాటా మాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. కూర్మన్నపాలెం ముస్తఫా కూడలి వద్ద మాంసం దుకాణంలో పనిచేస్తున్న అబ్బూ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనాన్ని రెండేళ్ల కిందట జగ్గరాజుపేటకు చెందిన వ్యక్తికి విక్రయించాడు. అప్పట్లో పేరు బదిలీ ప్రక్రియలో భాగంగా కావాల్సిన పత్రాలపై సంతకాలు చేశాడు. అయితే బదిలీ జరగక పోవడంతో ఆదివారం అబ్బూకు కొనుగోలుదారుడు ఫోన్ చేసి అడిగారు. అయితే ఆదివారం కావడంతో దుకాణం వద్ద బిజీగా ఉన్నందున సోమవారం వచ్చి సంతకాలు చేస్తానని బదులివ్వడంతో ఫోన్‌లోనే వాగ్వాదం జరిగింది. కొద్దిసేపటికి పక్కనే ఉన్న మెకానిక్ దుకాణదారుడి కుమారుడు కలుగజేసుకున్నాడు. ఈ నేపథ్యంలో వాహనం కొనుగోలు చేసిన వ్యక్తికి చెందిన వారు వచ్చి నిలదీశారు. దీంతో కొట్లాటకు దారితీసింది. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంకెన్నాళ్లీ.. నిరీక్షణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నూతన పింఛన్, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగేది. అర్హులైన వారు ఎప్పుడైనా సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకునేవారు. దరఖాస్తుల్ని పరిశీలించి, పింఛన్ మంజూరు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడు మాసాలవుతున్నా.. వెబ్‌సైట్ ఓపెన్ చేయట్లేదు. అర్హులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.



నాయుడుపాలెం గ్రామ సచివాలయం

- కొత్త పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు
- వెబ్‌సైట్ ఓపెన్ కావట్లేదంటున్న సచివాలయ సిబ్బంది
- రోజూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- నేతలకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం



పరవాడ: కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేయడానికి గ్రామ సచివాలయాలకు వెళుతున్న అర్హులకు ఇంకా వెబ్‌సైట్ ఒపెన్ కాలేదని, మళ్లీ రావాలని సిబ్బంది నుంచి సమాధానం వస్తోంది. ప్రభుత్వం మారి 7 నెలలవుతున్నా ఇంకా దరఖాస్తుల స్వీకారంపై తాత్సారమెందుకోనని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. కనీసం ఎప్పుడు వెబ్‌సైట్ ఓపెన్ అవుతుందో కూడా అధికారులు చెప్పలేకపోతున్నారని వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది సమాధానంతో కొత్త పింఛన్ల ఆశావహులు అయోమయానికి గురవుతున్నారు. సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత పింఛన్లే పంచుతున్నారు

పరవాడ మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళలు, డయాలసిస్ రోగులు తదితర కేటగిరీలో 6,535 మందికి పింఛన్లు అందుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వలంటీర్ వ్యవస్థ ద్వారా దరఖాస్తులను తీసుకుని, లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాత పింఛన్లు అందించడమే తప్ప, కొత్త పింఛన్ల ఊసెత్తకపోవడంతో ఆశావహులు మండిపడుతున్నారు. కొత్త పింఛన్ల వెబ్‌సైట్‌ను నూతన సంవత్సరంలో ఓపెన్ చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తుండడంతో దరఖాస్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కొత్త పింఛన్లివ్వాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తోంది. కొత్తగా వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లకు దరఖాస్తులు చేసుకునేవారు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా పార్టీలకు అతీతంగా నిరంతరం కొత్త పింఛన్లకు ధరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించాలి.
– వెన్నల సన్యాసిరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు

న్యూఇయర్లో ఉత్తర్వులు?



ప్రజల నుంచి కొత్త పింఛన్లు, రేషన్ కార్డులకు దరఖాస్తులు తీసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. నూతన పింఛన్ల మంజూరు విధివిధానాలపై నూతన ఏడాదిలో ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది.
– శ్యామ్‌సుందర్, ఎంపీడీవో, పరవాడ

వితంతువు వేదన

వాడచీపురుపల్లి గ్రామానికి చెందిన గుండా నాగలక్ష్మి భర్త చనిపోయి ఏడాది కావస్తోంది. భర్త మరణించిన అనంతరం వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామంటే.. ఆ సమయంలో ఎన్నికల కోడ్ అడ్డంకి. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయానికి వెళితే ఇంకా వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని సమాధానం.

వృద్ధాప్య వెతలు

వెన్నలపాలెం గ్రామానికి చెందిన ఎస్.సన్యాసిరావుకు 60 ఏళ్లు దాటాయి. నూతన పింఛన్ కోసం సచివాలయాన్ని సంప్రదిస్తే వెబ్‌సైట్ ఇంకా ఓపెన్ కాలేదని, వారం తర్వాత రావాలని చెప్పారు. ఇటీవల మళ్లీ వెళ్లి అడిగినా.. పాత సమాధానమే మళ్లీ వచ్చింది. దీంతో ఏం చేయాలో తెలియక దిగాలుగా వెనుదిరిగాడు.

ప'రేషన్'కార్డు!

వెంకటపతిపాలేనికి చెందిన చంద్రశేఖర్ గతంలో ఆదాయపన్ను చెల్లింపుదారుడు కావడంతో రేషన్ కార్డు తొలగించారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీంతో కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళ్లాడు. అతనికి కూడా వెబ్‌సైట్ ఓపెన్ కావట్లేదనే సచివాలయ సిబ్బంది సమాధానమిచ్చారు.

మండలంలో పింఛన్ల వివరాలు

వృద్ధాప్య	3,019	ఒంటరి మహిళ	224
వింతు	1,618	ట్రాన్స్‌జెండర్	1
వికలాంగులు	763	కల్లుగీత కార్మికులు	109
అభయహస్తం	498	ఇతరులు	90
మత్స్యకార	213	మొత్తం	6,535

'కాళింగ భవన్' నిర్మాణానికి వినతి



ఎమ్మెల్యే పంచకర్లకు వినతిపత్రం అందిస్తున్న కాళింగ సామాజికవర్గ ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో కాళింగ సామాజిక వర్గ భవన నిర్మాణానికి సహకారం అందించాలని కోరుతూ ఆ సామాజికవర్గ ప్రతినిధులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కోరారు. ఆదివారం చినముషిడివాడలో జరిగిన సమావేశంలో ఈ మేరకు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎస్.రామారావు, కోన వెంకటరావు, గోవిందరావు, భాస్కరరావు, శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం



హేమావతి, జెడ్సీ, జోన్–8

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 1 నుంచి జీవీఎంసీ జోన్–8 పరిధిలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని జోన్–8 కమిషనర్ కె.హేమావతి తెలిపారు. ఇప్పటికే వ్యాపారులు, ప్లాస్టిక్ ఉత్పత్తిదారులకు తగిన సూచనలు ఇచ్చామన్నారు. ప్రజలు ప్లాస్టిక్ నిషేధానికి అన్ని విధాల సహకారం అందించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం ద్వారా తలెత్తే దారుణ పరిణామాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామన్నారు. నిబంధనలు మీరి ప్లాస్టిక్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుంచారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- ఛిద్రమైన పెదముషిడివాడ–అసకపల్లి రోడ్డు
- భారీ వాహనాల రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం
- గోతులు, దుమ్ముధూళితో వాహనదారుల ఇక్కట్లు



రోడ్డుపై నిలిపిన బూడిద లారీలు



వాహనాల రాకపోకలతో దుమ్ము రేగుతున్న రహదారి



గోతులతో అధ్వానంగా మారిన పెదముషిడివాడ–అసకపల్లి రోడ్డు

పరవాడ: పెదముషిడివాడ–అసకపల్లి రహదారి అధ్వానంగా మారడంతో అనేక గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్డు మరింత ఛిద్రమైంది. దీని మరమ్మతులపై కూటమి ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టట్లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం రాకపోకలు సాగిస్తున్న టన్నుల బరువు కలిగిన ఎన్టీపీసీ బూడిద లారీలతో రోడ్డు ఎక్కడికక్కడ గోతులమయంగా మారింది. ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్, ఎన్టీపీసీ పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, పరిసర గ్రామాల ప్రజలు కార్లు, ద్విచక్ర వాహనాలపై ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాల కారణంగా మోకాలి లోతు గోతులతో నిండిన రహదారిలో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఏ మాత్రం వర్షం పడినా గోతుల్లో నీరు చేరి, రోడ్డేదో.. గొయ్యేదో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు.

వీధి దీపాలు లేక రాత్రి వేళ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డులో వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీల కారణంగా రేగుతున్న దుమ్ము ధూళి ప్రయాణికుల ఆరోగ్యాలను హరిస్తోంది. దీంతోపాటు అవి కంట్లో పడిన ఇబ్బందితో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు రోడ్డు పక్కన ఇష్టానుసారంగా నిలుపుతున్న భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. విస్తరణకు నోచుకోని రహదారిలో భారీ వాహనాలను నిలపడం వలన చిన్న చిన్న వాహనాలు సైతం తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

బూడిద, బొగ్గు లారీల రాకపోకలతో రోడ్డు ఎడ్జ్‌లు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాల్లో చిక్కుకుంటున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిని వెంటనే అభివృద్ధి చేసి ప్రయాణికుల కష్టాలను గట్టెక్కిస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రకటించి మూడు నెలలు దాటుతోంది. అయినా ఇప్పటి వరకు రోడ్డు అభివృద్ధిలో ఎలాంటి పురోగతి కనిపించలేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

పండగల వేళ అప్రమత్తం

- ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ–క్రైం ఎస్ఐ



డి.సూరిబాబు, క్రైం ఎస్ఐ, పెందుర్తి

పెందుర్తి: నూతన సంవత్సరంతో పాటు సంక్రాంతి సమీపిస్తున్న తరుణంలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు సూచించారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రజల సహకారం పోలీసులకు ఎంతో అవసరం అన్నారు. పెందుర్తి ప్రాంతంలో జరుగుతున్న నేరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దొంగతనాలు రాత్రి, పగలు అనే తేడా లేకుండా జరుగుతున్నందున విలువైన వస్తువులు లాకర్‌లో భద్రపరుచుకోవాలని ప్రజలకు సూచించారు. అపార్ట్‌మెంట్‌లు, ఇళ్లకు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలు నగలు జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. ప్రజలు ఇళ్లు వదిలి ఊరు వెళ్లేటపుడు ఇంటి చిరునామాను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల సమాచారం, ఇతర ఫిర్యాదుల కోసం 1090, 100, క్రైం సీఐ(94409 04717), క్రైం ఎస్ఐ(83310 41618), పీఎస్(0891–2764233) నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

నేడు కంప్యూటర్ విద్యపై వర్క్‌షాప్

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఇంట్రో టూ కంప్యూటింగ్' అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థి తరుణ్ పువ్వల విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలిగిస్తారని వెల్లడించారు. ఉదయం 10 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, విద్యార్థులంతా హాజరుకావాల్సిందిగా పేర్కొన్నారు.

వైభవం.. వెంకన్న కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చింతలగ్రహారం గవరపాలెం కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక నాయకుడు కాళ్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా ఉత్సవమూర్తులకు మంగళస్నానం చేయించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణం ఘనంగా జరిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, స్థానిక నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



వేంకటేశుని కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

సెయిల్‌లో విలీనంతో 'ఉక్కు'కు పూర్వవైభవం

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవం రావాలంటే సెయిల్‌లో విలీనం ఒక్కటే మార్గమని విశాఖ స్టీల్‌ప్లాంట్ శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1417వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఉక్కు శ్రామిక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, నిలిచిన టెండర్లు వెంటనే పిలవాలని కోరారు. కార్మికుల వేతనాలు, వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ఎల్‌రావు, కరణం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డు బీజేపీ అధ్యక్షుడిగా వర్మ



రచ్చ ఆనంద్ శ్రీనివాసవర్మ

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు భారతీయ జనాతా పార్టీ(బీజేపీ) అధ్యక్షుడిగా అడవివరానికి చెందిన రచ్చ ఆనంద్ శ్రీనివాసవర్మ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వర్మని ఆ పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వర్మని ఆదివారం అతని స్వగృహంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కలిసి అభినందించారు.

అ'పూర్వ' సమ్మేళనం



రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ 1987–88 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అడ్డూరు మజ్జి గౌరమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగింది. పాఠశాలలో 1987–88 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 36 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు గుర్తు పడుతూ, ఆనందంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి ప్రస్తుత తమ జీవిత విశేషాలను, కుటుంబ పరిస్థితులకు ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్బవరపు శ్రీనివాసరావు, గనివాడ ఈశ్వరరావు, రోమాల అక్కునాయుడు, వంటాకు ముత్యాలనాయుడు, గొటివాడ సత్యనారాయణ, గొంప రమణ, బోకం సత్యవతి, సబ్బవరపు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డులో అడుగడుగునా గోతులు



నారపాడు సమీపంలో అధ్వానంగా ఉన్న బీటీ రోడ్డు

సబ్బవరం: మండలంలోని బలిజపాలెం–నారపాడు జంక్షన్ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా తయారయ్యింది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటు సబ్బవరం మండలం అటు అనకాపల్లి మండలాలకు సరిహద్దులో ఈ రోడ్డు ఉండటంతో ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురవుతోంది. కనీస మరమ్మతులకు నోచుకోవట్లేదు. రెండు మండలాల సరిహద్దు రోడ్డు కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవట్లేదని స్థానికులు వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్బవరం–చోడవరం రోడ్డులోని ఆరిపాక పరిసర ప్రాంత గ్రామాలతో పాటు నారపాడు పరిసర ప్రాంతాల నుంచి అనకాపల్లి వెళ్లేందుకు ఇదే దగ్గరి మార్గం. దీంతో వాహనాల రాకపోకలు చాలా ఎక్కువ. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి ఈ రోడ్డును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.